సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం

ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి, ఆగస్టు 31: సమాజానికి బాల కార్మిక వ్యవస్థ గుదిబండలా మారిందని, దానిని సమూలంగా నిర్మూలించేందుకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించిందని ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో జేజే యాక్ట్-2015, చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్ పనితీరు, సీసీఎల్స్ ఇంటర్వ్యూ(విచారణ)లో పోలీసుల పాత్ర అనే అంశంపై నల్సార్ యూనివర్సిటీ, యూనిసెఫ్, చైల్డ్ ప్రొటెక్షన్ రిసోర్స్ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వెల్ఫేర్, విద్యాశాఖల సహకారంతో ప్రతి ఏడాది ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ బాల కార్మికులకు విముక్తి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బాలకృష్ణ, యూనిసెఫ్ ప్రతినిధి డేవిడ్ రాజు, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి లలితకుమారి, అదనపు ఎస్పీ సంజీవరావు, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రాజారెడ్డి, ఎస్‌బీ ఇన్స్పెక్టర్ విజయ్‌కృష్ణ, నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, మహిళా స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రమీల జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వీధి కుక్కల సంఖ్యను తగ్గించాలి

కలెక్టర్ క్రాంతి వల్లూరు

కంది, ఆగస్టు 31: జిల్లాలో వీధి కుక్కల సంఖ్యను తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కాంత్రి వల్లూరు సంబంధిత అధికారులను ఆదేశించారు. కంది మండలం కాశీపూర్‌లోని ఏనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్(ఏబీసీ)ని శనివారం కలెక్టర్ పరిశీలించారు. స్టెరిలైజేషన్ చేసిన కుక్కల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గుర్తించిన కుక్కలను ఏబీసీ సెంటర్‌కు తరలించాలని సూచించారు. ఇప్పటివరకు 1,105 కుక్కలకు స్టెరిలైజేషన్ చేసినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి కలెక్టర్‌కు వివరించారు.

భారీ వర్షాలతో జాగ్రత్త

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 31: వచ్చే 48 గంటల్లో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో శనివారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భారీ వర్షాలకు జిల్లాలో ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ నంబర్ 08455-276155కు సమాచారం అందించాలన్నారు. ఈ కంట్రోల్ రూమ్ 24/7 పని చేస్తుందన్నారు. కంట్రోల్ రూమ్ ద్వారా సమాచార సేకరణ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టేలా ఆయా శాఖల అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు.

కాశీపూర్‌లోని ఏనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

కోహీర్, ఆగస్టు 31: జహీరాబాద్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి కేటాయించిన చెక్కులను పంపణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఝరాసంగం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, నర్సింహాగౌడ్, వెంకట్‌రెడ్డి, సంజీవరెడ్డి, రాజేందర్ రెడ్డి, నవీన్ తదితరులు ఉన్నారు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

పటాన్‌చెరు, ఆగస్టు 31: ప్రజలు కోరిన అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం బండ్లగూడలో రూ.130కోట్లతో చేపట్టనున్న హిందు, ముస్లిం, క్రిస్టియన్ శ్మశానవాటికల ప్రహరీ నిర్మాణ పనులకు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్‌తో కలసి శంకుస్థాపన చేశారు. అనంతరం కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అవసరాలను గుర్తించి పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్ ఉన్నారు.

పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

అప్రమత్తంగా ఉండాలి

సంగారెడ్డి ఆగస్టు 31: వచ్చే రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శనివారం ప్రకటనలో కోరారు. మట్టి మిద్దెలు, శిథిలావస్థలో ఉన్న గృహాల్లో నివాసం ఉండేవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు జాగ్రతలు చేపట్టాలన్నారు. చెరువులు, వాగుల్లోకి వరద ప్రవాహం ఎక్కువ ఉండే అవకాశాలు ఉంటాయని, నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది నీటి ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

కాలుష్యంపై యువకుడి పాదయాత్ర

పాదయాత్రగా వెళ్తున్న కన్న సాయి

సదాశివపేట, ఆగస్టు 31: మండల పరిధిలోని ఆరూర్ శివారులోని ఎవరెస్ట్ ఆర్గానిక్స్ పరిశ్రమను మూసివేయాలని కోనాపూర్ గ్రామానికి చెందిన కన్నసాయి పాదయాత్ర చేపట్టాడు. శనివారం ఎవరెస్ట్ ఆర్గానిక్స్ పరిశ్రమ నుంచి ప్రారంభించిన పాదయాత్ర హైదరాబాద్‌లోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వరకు కొనసాగనున్నది. ఈ సందర్భంగా కన్నసాయి మాట్లాడుతూ ఎవరెస్ట్ పరిశ్రమ వెదజల్లే కాలుష్యంతో ఆరూర్, కోనాపూర్, నాగులపల్లి, మునిపల్లి మండలంలోని గోపులారం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరిశ్రమను మూసివేసి కాలుష్యం నుంచి ప్రజలను రక్షించాలని కోరారు.

ఉద్యోగులకు విరమణ తప్పనిసరి

హెచ్ఎం సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి

బొల్లారం, ఆగస్టు 31: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ కోలన్ రోజాబాల్ రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఉమాదేవి పదవీ విరమణ అభినందన సభకు హాజరై మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏడీ విజయ, నోడల్ ఆఫీసర్ కుమారస్వామి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నల్తూరులో భక్తుల నిర్విరామ భజన

జిన్నారం, ఆగస్టు 31: మండలంలోని నల్తూరు గ్రామంలో ఆగస్టు 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు నిర్విరామ భజన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తుడు కనకాచారి ఆధ్వర్యంలో రోజుకు నాలుగు బృందాలు నాలుగు షిఫ్టులుగా భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండల ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రజలందరికీ శుభం జరగాలని భజన నిర్వహిస్తున్నారు. శనివారం మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ హాజరై మాట్లాడారు.

టీపీటీఎఫ్ నూతన కమిటీ

జిన్నారం, ఆగస్టు 31: టీపీటీఎఫ్ మండల నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజారెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాంచందర్, ఉపాధ్యక్షులుగా ఎస్ఎం శ్రీధర్‌బాబు, పద్మ, ప్రధాన కార్యదర్శిగా రాంచందర్, కార్యదర్శులుగా వెంకటేశ్ , సూజాత, దయాకర్, జిల్లా కౌన్సిలర్లుగా ఏఎం ఆనందం, రమేశ్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రాధాకృష్ణ చౌహాన్

ప్రాథమిక హక్కులకు భంగం కలిగించొద్దు

సంగారెడ్డి, ఆగస్టు 31: సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు ఉన్న వసతులను సెక్స్ వర్కర్లకు కల్పించి వారి సంక్షేమానికి కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి రాధాకృష్ణ చౌహాన్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 12వ వార్డు పరిధిలోని ఓ ప్రైవేట్ బాంక్వెట్‌హాల్‌లో సంగ్రామ్ సంస్థ ఆధ్వర్యంలో సెక్స్‌వర్కర్ల హక్కులపై జిల్లా స్థాయి న్యాయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం ట్రాన్స్, హిజ్రా, మహిళా సెక్స్‌వర్కర్ల కోసం పనిచేస్తున్న ప్రేమ జ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన జడ్జి మాట్లాడుతూ సమాజంలో సెక్స్‌వర్కర్లుగా కొనసాగుతున్న వారి సంక్షేమానికి భారత ప్రభుత్వం తీసుకోవాల్సిన వసతులపై సుప్రీంకోర్టు ఇచ్చిన సిఫార్సులను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి లలితకుమారి, ప్రేమజ్యోతి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అవంతిక తంగెళ్ల, పోలీసుల అధికారులు, విద్యాశాఖ, డీఎంహెచ్ఓ, పౌరసరఫరాల అధికారులు, సఖి కేంద్రం కౌన్సిలర్లు, 70మంది ట్రాన్స్ జెండర్, హిజ్రా ఎంఎస్ఎం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

బొల్లారం, ఆగస్టు 31: నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఏర్పాటు చేసిన రోడ్డుకు హుడా అధికారులు ట్రెంచ్ కొట్టారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని మైత్రి లేక్ వ్యూ సర్వీస్ రోడ్డును ఆనుకొని అక్రమంగా రోడ్డును ఏర్పాటు చేశారని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై హుడా అధికారులు స్పందించి శనివారం జేసీబీ సహాయంతో ట్రెంచ్ కొట్టారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే నంబర్ 44లో మైత్రి కన్‌స్ట్రక్షన్స్ అక్రమ నిర్మాణాలను చేపడుతున్నదని హుడా అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న నిర్మాణాలపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

సర్వీస్ రోడ్డు పక్కన అక్రమంగా వేసిన రోడ్డుకు ట్రెంచ్ కొట్టిన హుడా అధికారులు

భారీ వర్షం.. రోడ్లపై నిలిచిన నీరు

బొల్లారం, ఆగస్టు 31: ఎడతెరిపి లేకుండా శుక్రవారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి బొల్లారం మున్సిపల్ రోడ్లు జలమయంగా మారాయి. జనం ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. శనివారం మున్సిపల్ కమిషనర్ పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించారు. పలుచోట్ల రోడ్లపై చేరిన వరద నీటిని పరిశీలించి వెంటనే తొలిగించే ఏర్పాట్లు చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్‌ను ఆదేశించారు. భారీ వర్షానికి పలు కాలనీల్లోకి వరద నీరు చేరిందని, వెంటనే సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా నీరు నిలవకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్ మంగతాయారు శానిటేషన్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

భారీ వర్షానికి ఆరో వార్డు బాలాజీ నగర్‌లో రోడ్లు గుంతలుగా మారడంతో స్థానికుల అవస్థలు పడుతున్నారని తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ గుండ్ల సుజాతామహేందర్ రెడ్డి సొంత నిధులతో గుంతలను జేసీబీ సహాయంతో పూడ్చివేయించారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి ఉన్నారు.

మున్సిపల్ రోడ్లపై చేరిన వరద నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ మంగతాయారు

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

బొల్లారం, ఆగస్టు 31: వచ్చే మూడు రోజులపాటు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు బొల్లారం మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ మంగతాయారు శనివారం ప్రకటనలో తెలిపారు. వర్షాల నేపథ్యంలో మున్సిపల్ ప్రజలకు ఎలాంటి అత్యవసర సమస్యలు తలెత్తినా డీఆర్ఎఫ్ టీంతో పాటు కంట్రోల్ రూమ్ నంబర్ 74163 86664కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ మూడు రోజులపాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పారిశుధ్యానికి పెద్దపీట వేయాలి

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి

బొల్లారం, ఆగస్టు 31: ప్రతి ఒక్కరూ శుభ్రతకు పెద్దపీట వేయాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ కోలన్ రోజా బాల్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛదనం పచ్చదనం ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ఫైలేరియా వ్యాధులను సమూలంగా రూపుమాపాలంటే శుభ్రతతోనే సాధ్యమన్నారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా వైద్య బృందం ప్రజలకు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారని, శిబిరాలు ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు ఇచ్చారన్నారు. దోమల నివారణ, పరిసరాల్లో చెత్తాచెదారం, నీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం మన సొంతమన్నారు. ఆరోగ్యవంతమైన మున్సిపాలిటీగా తయారు చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని డాక్టర్ నిర్మలారెడ్డి అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, శానిటరీ ఇన్స్పెక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

అందోల్‌లో..

అందోల్, ఆగస్టు 31: వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వర్షాకాలంలో వచ్చే వ్యాధులను నివారించవచ్చని కళాకారులు ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ తిరుపతి ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో వ్యాధుల నివారణపై జోగిపేటలో ఆట పాటల రూపంలో దోమల విజృంభనతో వచ్చే వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రతతో వాటి నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు శేకర్‌గౌడ్, మదన్, రాజు, రవీందర్, చామంతి, ఆగమయ్య, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోహీర్, ఆగస్టు 31: కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. జహీరాబాద్ మండలంలోని సత్వార్ గ్రామానికి చెందిన పెంటప్ప (61) సైకిల్‌పై గోపన్‌పల్లి కూడలి వద్ద 65వ జాతీయ రహదారి దాటుతుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ దవాఖానకు తరలించి అతడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బస్సు, కారు ఢీ: నలుగురికి గాయాలు

హత్నూర, ఆగస్టు 31: బస్సు, కారు ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని సిరిపుర శివారులోని తెల్లరాళ్లతండా గేటువద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపేట నుంచి నర్సాపూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు తెల్లరాళ్ల తండా సమీపంలో మలుపు వద్ద ఎదురు గావస్తున్న కారును ఢీకొట్టడంతో కారు రోడ్డు కిందకు వెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలుకాగా చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ విషయమై హత్నూర పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు రాలేదని తెలిపారు. తెల్లరాళ్ల తండా గేటువద్ద గల మలుపులో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

మట్కా నిర్వాహకులపై కేసు

కోహీర్, ఆగస్టు 31: జహీరాబాద్ పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయం సమీపంలో ఆరుగురు వ్యక్తులు కలిసి శుక్రవారం రాత్రి గుంజాయి విక్రయం, మట్కా నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో దాడులు నిర్వహించి వారిపై కేసు నమోదు చేశామని జహీరాబాద్ పట్టణ ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జహీరాబాద్‌కు చెందిన మహ్మద్ ఖాజాపాషా, గుర్రం శ్రీనివాస్, మహ్మద్ అక్రమ్, మహ్మద్ హర్షద్, మహ్మద్ సమీయుద్దీన్, మహ్మద్ రఫీలను అరెస్ట్ చేశామని వెల్లడించారు. వారి నుంచి రెండున్నర కిలోల ఎండు గంజాయి, 11ఫోన్లు, రూ.2,410 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వారిని కోర్టుకు తరలించామని వెల్లడించారు.

పోషకాహారం తీసుకోవాలి

సంగారెడ్డి, ఆగస్టు 31: తీసుకునే ఆహారంపై ప్రతిఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సరిత అన్నారు. శనివారం మండల పరిధిలోని ఫసల్‌వాది గ్రామంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామస్తులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలు పౌష్టికరమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. పోషకాలు ఎక్కువ ఉన్న చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, మునగాకు వంటివి తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. పౌష్టికాహార లోపం ఉంటే చిన్నారులు శారీరకంగా, మానసిక అభివృద్ధి చెందరన్నారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉంటే పుట్టే బిడ్డలు ఆరోగ్యవంతంగా పుడతారన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు చితం సాయన్న, మల్లేశం, గొడుగు రాములు, మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ

అందోల్, ఆగస్టు 31: అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలోని వసతి గృహాలను శనివారం అధికారులు తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జోగిపేట కోర్టు జడ్జి ధనలక్ష్మి బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేయగా.. ఆర్డీవో పాండు, మున్సిపల్ కమిషనర్ తిరుపతి బాలికల మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతులు, విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వంటశాలలకు వెళ్లి భోజనం, కూరగాయలు, వంట సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులకు మంచి నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బహుమతి ఉన్నారు.

నాగల్‌గిద్ద రైతు వేదికవద్ద వేచి చూస్తున్న రైతులు

పంట రుణమాఫీకి రైతుల అగచాట్లు

నాగల్‌గిద్ద, అగస్టు 31:ప్రభుత్వ నిర్ణయాలతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం మూడు దఫాలుగా పంట రుణ మాఫీ చేసింది. ఆయా జాబితాల్లో పేరు రాని రైతులు వ్యవసాయ పనులు వదులుకొని బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద రుణ మాఫీ చేయాలని కోరుతూ అర్జీలు ఇవ్వడానికి రైతులు భారీగా తరలివచ్చారు. సాంకేతిక కారణంతో గంటల తరబడి అర్జీలు స్వీకరించలేదు. దీంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

పేదల ఇండ్లను కూల్చివేయొద్దు

సంగారెడ్డి, ఆగస్టు 31: భవిష్యత్ తరాలకు చెరువులు, నాలాల పరిరక్షణ ఎంతో అవసరమని, ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇండ్లు కూల్చొద్దని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జయరాజు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులు, నాలాలు, జల వనరుల సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా వ్యవస్థను ఆహానిస్తున్నామని, ఈ పేరుతో చెరువులు, నాలాల పక్కన ఏండ్లుగా నివసిస్తున్న పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా వారి ఇండ్లను కూల్చొద్దని కోరారు. పటాన్‌చెరు, అమీన్‌పూర్‌లలో పేదలు అనేక ఏండ్ల నుంచి ఇండ్లు కట్టుకొని ఉన్నారని, ఆ ఇండ్లను ఆక్రమణల పేరుతో నోటీసులు ఇచ్చి బయాందోళనలకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు మాణిక్యం, యాదగిరి, భూషణ ఉన్నారు.

మాట్లాడుతున్న జయరాజు

వివక్ష చూపితే కఠిన చర్యలు

కల్హేర్, ఆగస్టు 31: వ్యక్తుల పట్ల వివక్ష చూపుతూ అసమానతను పాటించే వారిపై కఠిన చర్యలు తప్పవని నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని బీబీపేట్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్సీ వాడలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరుల హక్కులకు భంగం కల్గించవద్దని, అంటరానితనానికి దూరంగా ఉంటూ పౌరులందరూ సమానత్వంతో మసలుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివ శ్రీనివాస్, ఏఎస్ఐ అంజయ్య, ఎంఆర్ఐ మల్లేషం, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పౌర హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

సిర్గాపూర్, ఆగస్టు 31: ప్రజలు పౌర హక్కులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఉమాశంకర్ అన్నారు. శనివారం సిర్గాపూర్ మండల కేంద్రంలోని దళితవాడ అంబేద్కర్ భవన్‌లో సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అంటరానితనం, దళితుల పట్ల వివక్షకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వేచ్ఛగా వినియోగించుకోవాల్సిన సివిల్ రైట్స్‌పై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గిర్దావర్ మదన్, పోలీసు హెడ్ కానిస్టేబుల్ తుకారం పాల్గొన్నారు.

కల్హేర్: బీబీపేట్‌లో ఎస్సీ కాలనీవాసులతో చర్చిస్తున్న ఆర్డీవో అశోక చక్రవర్తి

అందరూ కలిసిమెలిసి ఉండాలి

మనూరు, ఆగస్టు 31: రెండు గ్లాసుల పద్ధతి వాడకుండా అందరు కలిసిమెలిసి ఉండాలని తహసీల్దార్ వెంకటస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రమైన మనూరులో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలో అందరు కలసిమెలిసి ఉండి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామంలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రాంచందర్, శంకర్ రెడ్డి, ఖాజా పాల్గొన్నారు.

వార్డుల వారీగా ఓటర్ల జాబితా సవరణ

రాయికోడ్, అగస్టు 31: స్థానిక సంస్థలకు ప్రభుత్వం త్వరలో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు సంబంధించి శనివారం నుంచి వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సవరిస్తున్నట్లు ఎంపీడీవో ఎంఎం షరీఫ్ పేర్కొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండల పరిధిలో మొత్తం 9,280 ఇండ్లు ఉన్నాయని, మొత్తం 32,362 మంది ఓటర్లు ఉన్నాయన్నారు. 264 వార్డులుగా విభజించినట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీవో అంజలీదేవి, అధికారి నర్సిహారెడ్డి ఉన్నారు.

సమగ్ర సర్వే చేపట్టాలి

జిన్నారం, ఆగస్టు 31: మాదారం గ్రామంలో ఓటరు జాబితాపై స